


6న ఛలో అసెంబ్లీని జయప్రదం చేయాలి

సర్పంచ్‌ల 16 డిమాండ్ల కోసం ముట్టడి

ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

- 7లో

ఎక్కడో జగన్ సభ.. ఇక్కడా పాట్లే

» తరలిన ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల ఇక్కట్లు

» జిల్లావ్యాప్తంగా స్కూళ్లు, కళాశాలలకు సెలవు

» జనం తరలింపునకు ప్రైవేటు స్కూళ్ల బస్సులు

» చివరకు జనం లేక ఖాళీగా వెనుదిరిగిన బస్సులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో వైసీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'సిద్ధం' సభకు ఆర్టీసీ బస్సులు తరలించడంతో జిల్లా అంతటా ప్రజా రవాణా స్తంభించిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన బస్సులను జనాన్ని తరలించేందుకు వినియోగించడంతో శనివారం కోనసీమ జిల్లావ్యాప్తంగా స్కూళ్లకు సెలవులు ఇచ్చారు. శనివారం జరగాల్సిన ఇంటర్మీడియట్ ప్రీఫైనల్ పరీక్షను సైతం వాయిదా వేయడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఇంటర్ విద్యామండలి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారులే పరీక్షను వాయిదా వేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈనెల 23న ఈ పరీక్షను నిర్వహించనున్నట్టు ప్రకటించారు. దాంతో వేలాది మంది విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. ఇక జిల్లావ్యాప్తంగా 110 ఆర్టీసీ బస్సులు, వందల సంఖ్యలో ప్రైవేటు బస్సులు, కోనసీమ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జన సమీకరణ చేశారు. కోనసీమలోని ఐదు నియోజకవర్గాల నుంచి రావులపాలెం మీదుగా దెందులూరు సభకు జనాన్ని తరలిస్తున్న బస్సులతో రావులపాలెం ముఖ్య కూడలి ట్రాఫిక్‌తో పద్మవ్యూహంలా మారింది. ట్రాఫిక్ భారీగా స్తంభించిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎక్కడికక్కడే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఇదిలా ఉండగా బస్సులను సిద్ధం సభకు తరలించడంతో వివిధ రూట్లలో తిరిగే బస్సు సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు పడ్డ కష్టాలు వర్ణనాతీతం. అమలాపురం, రామచంద్రపురం, రాజోలు, రావులపాలెం డిపోల పరిధిలో వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించారు. బస్సులు లేక బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. దీన్ని అదునుగా చేసుకుని ప్రైవేటు వాహనాల యజమానులు రేట్లు పెంచి ప్రజలను నిలువు దోపిడీ చేశారు. కాగా వివిధ నియోజకవర్గాలకు జగన్ సభ కోసం కేటాయించిన ఆర్టీసీ బస్సుల్లో పెద్దగా జనం ఎక్కకపోవడంతో చాలా బస్సులు ఖాళీగానే వెనుదిరిగి ఆయా డిపోలకు వెళ్లిపోవడం విశేషం.



అమలాపురం ఆర్టీసీ డిపోలో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రావులపాలెంలో ట్రాఫిక్ పద్మవ్యూహం

» జాతీయ రహదారిలో అస్తవ్యస్తంగా మారిన రాకపోకలు

రావులపాలెం, ఫిబ్రవరి 3: సీఎం జగన్ సభ కోసం జాతీయ రహదారిపై ఒకపక్క వాహనాల సంఖ్య పెరగడం, మరోపక్క వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తుల వాహనాలతో రావులపాలెం కళావెంకట్రావు సెంటర్ వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. సీఎం జగన్ సభకు తరలివెళ్లేందుకు రావులపాలెం మండల పరిధిలోని మల్లాయిదొడ్డి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో కొత్తపేట నియోజకవర్గానికి కేటాయించిన బస్సులను నిలుపుదల చేశారు. అక్కడ నుంచి వైసీపీ నాయకులతో ఈతకోట సెంటర్ వరకూ ఓ బస్సు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న సమయంలో పోలీసులు జాతీయ రహదారిపైకి వచ్చే ఇతర వాహనాలను నిలుపదల చేశారు. ఒకవైపు రహదారిని పూర్తిగా వాహనాలు రాకపోకలు సాగించకుండా నిలుపుదల చేశారు. దీంతో ఓ సమయంలో ఈతకోట జాతీయ రహదారి సెంటర్ నుంచి గోపాలపురం వశిష్ట సెంటర్ వరకూ వాహనాలు నిలిచిపోయాయి. అదే మాదిరిగా రావులపాలెం కళావెంకట్రావు సెంటర్ వద్ద ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చే వాహనాలు వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చే వాహనాలు, సిద్ధం సభకు వెళ్లే వాహనాలు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుపోయాయి. కళావెంకట్రావు సెంటర్ నుంచి గౌతమి వంతెన వరకూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాడపల్లి వెళ్లే భక్తులు వాహనాలు దిగి కాలినడకన ముందుకు సాగారు. సీఎం సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద ఎన్‌హెచ్‌పై స్తంభించిన ట్రాఫిక్

వాడపల్లి భక్తులకు అష్టకష్టాలు



బస్సుల కోసం ఆత్రేయపురం మండలం వాడపల్లి బస్ కాంప్లెక్స్‌లో భక్తుల పడిగాపులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి3: ఏలూరులో నిర్వహిస్తున్న సీఎం జగన్ సిద్ధం సభకు వందలాది ఆర్టీసీ బస్సుల ద్వారా కార్యకర్తలను తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ డిపోల ద్వారా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. బస్సులన్నీ సీఎం సభకు మళ్లించడంతో ఇక్కడికి వచ్చే బస్సు సర్వీసులను కుదించారు. ఏడు వారాల మొక్కులున్న భక్తులు వివిధ మార్గాల ద్వారా స్వామివారి సన్నిధికి చేరుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు. తిరిగి వెళదామనుకున్న ప్రయాణికులు క్షేత్ర బస్‌స్టేషన్ వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొర సర్వీసుల్లో భక్తులు కిక్కిరిసి ప్రయాణాలు సాగించారు. జాతీయ రహదారుల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో నిర్ణీత సమయానికి గమ్యస్థానాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

జగన్‌ను గద్దె దింపాలి



మాట్లాడుతున్న మహాసేన రాజేష్

» దళితులంతా ఏకమవ్వాలి

» ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తలు

- 7లో





మామిడికుదురు, కపిలేశ్వరపురం తహశీల్దార్ ఆఫీసుల వద్ద నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

తహశీల్దార్ హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలి

రెవెన్యూ ఉద్యోగుల నిరసనలు

కపిలేశ్వరపురం/మామిడికుదురు, ఫిబ్రవరి3: విశాఖలో తహశీల్దార్ రమణయ్య హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి హంతకులను కఠినంగా శిక్షించాలని రెవెన్యూ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం కపిలేశ్వరపురం, మామిడికుదురు మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద తహశీల్దార్ రమణయ్య హత్యను ఖండిస్తూ రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలంటూ కపిలేశ్వరపురంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. మల్లేష్, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొని రమణయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మామిడికుదురులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవళ్ల శ్రీనివాస్, వీఆర్వోలు కె.నారాయణ, ఆర్.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా తహశీల్దార్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వీఆర్‌వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్ డిమాండ్ చేశారు.



బీసీల భరోసా బాటలో మాట్లాడుతున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ రామారావు

వైసీపీని సాగనంపేందుకు సిద్ధంకావాలి

» బీసీల భరోసా బాట కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 3: బీసీ చేతివృత్తుల సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు బీసీ చేతివృత్తులవారంతా ఒక్కటి కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పిలుపునిచ్చారు. అమలాపురం పార్లమెంటు టీడీపీ రజక సాధికార కమిటీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగిన బీసీల భరోసాబాట బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ చేతివృత్తిదారుల అభ్యున్నతికి టీడీపీ హయాంలో ఆదరణ వంటి పథకాలు, రుణ సదుపాయాలు కల్పిస్తే నేడు సీఎం జగన్ నిధులు, విధులేని కార్పొరేషన్లు ఏర్పాటుచేసి బీసీలను అన్నివిధాలా అణగదొక్కారన్నారు. రజకులు దుస్తుల్లో ఉన్న మురికిని వదిలించడానికి వాటిని ఎలా బండకేసి బాదుతారో, అదే విధంగా ఈ వైసీపీ ప్రభుత్వాన్ని బాది సాగనంపాలని పిలుపునిచ్చారు. అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన అనేకమంది బీసీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సామాజిక న్యాయం కోసమేకాక రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు అధికారంలోకి రావడం ఎంతో అవసరమన్నారు. దీన్ని గుర్తించి టీడీపీ, జనసేన పార్టీల విజయానికి అంతా కృషి చేయాలన్నారు. ముమ్మిడివరం టీడీపీ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ అధికారం, పదవుల కోసం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పొత్తు పెట్టుకోలేదని, రాష్ట్ర అభివృద్ధి, బావితరాల భవిష్యత్తు కోసమే పొత్తు పెట్టుకున్నారన్నారు. జనసేన ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను అంతమొందించేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు కలిశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తుల సాయి, రాష్ట్ర రజక సాధికార సమితి కన్వీనర్ గుఱ్ఱపుశాల రామకృష్ణ, టేకు వెంకటేశ్వరరావు, పేట నాగరాజు, గొల్లపల్లి ధర్మారావు, పోలవరపు వెంకటరమణ, పసుపులేటి శివ, పేరూరి శ్రీరామమూర్తి, పుల్లయ్య, చిటికెన వెంకన్న, ఇల్లూరి నాగసత్యనారాయణ, కలిదిండి సూర్యనారాయణ, మల్లేశ్వరపు రామకృష్ణ, టేకి వెంకటేష్, అంగర ఉదయభాస్కర్, సూదికొండ రాముడు, పసుపులేటి శివశంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో భక్తుల కిటకిట

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ఫలపుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం



స్వీకరించారు. అనంతరం రాత్రి నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖుల కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.34.07 లక్షలు లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



క్యూలైన్‌లో భక్తులు





పొగమంచు కమ్మేసింది..

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: పచ్చని కోనసీమలో శనివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకూ మంచు దుప్పటి కప్పేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం రహదారులు అలాగే ఇళ్లపై దట్టమైన పొగమంచు కమ్మేసింది. అనంతరం మధ్యాహ్నం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చాడు.

గోపురాలు స్వర్ణమయం చేసేందుకు పరిశీలన





పరిశీలన చేస్తున్న దృశ్యం

అన్నవరం, ఫిబ్రవరి 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ప్రధానాలయ విమాన గోపురం, ఇతర ఉపాలయాల గోపురాలను స్వర్ణమయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత పాలకమండలి సమావేశంలో ఆమోదం పొంది కమిషనర్ అనుమతి కోసం ఈవో రామచంద్రమోహన్ లేఖ రాయడంతో శనివారం దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి విమానగోపురం, ఉపాలయాల గోపురాలను పరిశీలించారు. దీనికి సుమారు 12.5 కిలోల బంగారం అవసరమవుతుందని రూ.8 కోట్లు వ్యయం కాగలదని ప్రాథమిక అంచనా వేసినట్లు పరమేశ్వరప్ప పేర్కొన్నారు. అయితే గత కొలతల ఆధారంగా అంచనా వేశామని దేవదాయ శాఖ కార్యాలయంలో మరోసారి కొలతలపై లెక్కకట్టి స్పష్టమైన వ్యయం తెలుపుతామని అన్నారు. స్థపతి వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు తదితరులున్నారు. అనంతరం దేవదాయశాఖ స్థపతి ఈవో కార్యాలయంలో రామచంద్రమోహన్‌ను కలసి అంచనా వ్యయంపై చర్చించారు. దీనికయ్యే వ్యయం డోనార్ స్కీం ద్వారా పూర్తిచేయాలని ఈవో రామచంద్రమోహన్ ఆలోచన చేస్తున్నారు. సుమారు 12 ఏళ్ల క్రితం రామచంద్రమోహన్ ఈవోగా పనిచేసిన కాలంలో ఆలయ పునర్నిర్మాణం చేపట్టగా అప్పట్లో బంగారు తాపడం చేయాలనే ఉద్దేశంతో విమాన గోపురానికి గ్రానైట్ కాకుండా ఇటుకలతో నిర్మాణం చేపట్టారు. మళ్లీ ఆయన ఈవో బాధ్యతలలో ఉండడంతో విమానగోపురం బంగారం చేయించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి.

దళితులంతా ఏకం కావాలి

జగన్‌ను గద్దె దింపాలి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తల పిలుపు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3: దళిత ద్రోహి జగన్‌ను గద్దె దింపాలని, ఇందుకు దళితులంతా ఏకమవ్వాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తలు పిలుపునిచ్చారు. దగా పడ్డ.. దళితుడా.. నినాదంతో శనివారం కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభకు మహాసేన రాజేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు విచ్చేశారు. సభలో మాజీ ఎంపీ ఏవీ బుచ్చిమహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణరావు, నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, నక్కా సునీల్, మద్దాల చంటి, మొండి కమల ప్రసంగించారు. మహాసేన రాజేష్ మాట్లాడుతూ వైసీపీలో ఉన్న దళిత నాయకులందరూ దళిత ద్రోహులన్నారు. వైసీపీ ప్రభుత్వం దళితులను, కార్పొరేషన్లను విడగొట్టి పబ్బం గడుపుతుందన్నారు. ఒకప్పుడు దళితులు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్య, స్వయం ఉపాధి పథకాలు ద్వారా తోడ్పాటు అందించిన ఘనత చంద్రబాబునాయుడుదన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన వారిని అరెస్టు చేయాలని మన తరఫున ఆందోళన చేపట్టిన వనమాడి కొండబాబుకు అండగా ఉండాలన్నారు. ఎవరైనా మనజోలికి వస్తే ఊరికే పంపించవద్దని, వారికి తగిన రీతిలో సారె పెట్టి పంపించాలన్నారు. కాకినాడలో ఈ సభ జరగకుండా చేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అన్ని విధాలా ఆటంకాలు కల్పించాడని, సభకు వెళ్లితే సంక్షేమ పథకాలు పోతాయని దళితులను బెదిరించాడన్నారు. వైసీపీ నాయకుల కేసులకు, వలంటీర్ల బెదిరింపులకు భయపడకుండా సభకు తరలివచ్చిన మాలలను చంద్రశేఖరరెడ్డి చూసుకోవాలని రాజేష్ సవాల్ చేశారు. ఇదే పరిస్థితి చంద్రశేఖరరెడ్డికి ఉంటే ఇంటి లోంచి గుమ్మం దాటడని, మావాళ్లు గుమ్మాలు దాటి, ఊళ్లు దాటి సభకు తరలి వచ్చారన్నారు. తన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మీద ఇప్పటికే 30 కేసులు పెట్టించారని అన్నారు. ద్వారంపూడి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, దళితుల ఓట్ల ద్వారానే ద్వారంపూడికి బుద్ధి చెబుతామన్నారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, జగన్‌రెడ్డి రద్దు చేసిన 27 దళితుల సంక్షేమ పథకాలు మళ్లీ అమలు చేయడం తథ్యమన్నారు. మోకా ఆనందసాగర్ మాట్లాడుతూ దళిత కార్పొరేషన్‌ను ముక్కలు చేసిన ఘనత జగన్మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. గత నాలుగున్నరేళ్లలో 2,700 మంది దళితులపై దాడులు జరిగినా ఒక్కరికి కూడా శిక్ష పడలేదన్నారు. ఇంత అన్యాయం దళితులకు జరిగినా ఇంకా వైసీపీ ప్రభుత్వానికి కొంతమంది దళితద్రోహులు భజన చేస్తున్నారన్నారు. కాశి నవీన్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అనేక మంది దళితులు అక్రమంగా శిక్షింపబడ్డారన్నారు. నక్కా సునీల్ మాట్లాడుతూ వైసీపీ దళిత ద్రోహి పార్టీ అన్నారు. దళితులకు రాజకీయాల్లోను, ఉన్నత విద్యలోను అవకాశం కల్పించిన ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, దళిత యువకులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. యువకుల నినాదాలతో ప్రాంగణం మారుమోగింది. దళిత నాయకులు బత్తుల సాయి, సీకోటి అప్పలకొండ పాల్గొన్నారు.

దళితులకు ద్రోహం చేసిన జగన్‌ను

దించేస్తున్నాం

అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: దళితులకు ద్రోహం చేసిన సీఎం జగన్‌ను దించేయబోతున్నామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో జగన్ దళితులను అణగదొక్కాడని, దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకే ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నామన్నారు. దళితులకు అన్యాయం జరుగుతుంటే వైసీపీలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న దళితులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులకు మేలు చేసే 27 పథకాలను రద్దుచేస్తే అడిగేవాడు లేడని, నవరత్నాల్లో అమ్మఒడి పథకంలో అందరికీ వేసే డబ్బులు జనరల్ ఫండ్స్ నుంచి కేటాయించి, దళితులకు మాత్రం సబ్‌ప్లాన్ నుంచి ఎందుకు కేటాయించారని హర్షకుమార్ ప్రశ్నించారు. ఎస్సీ వసతి గృహాల్లో దుర్మార్గ పరిస్థితులు ఉన్నాయని, స్టడీ సెంటర్లు నిర్వీర్యం చేశాడని, ఇక యూనివర్సిటీల్లో వీసీలంతా జగన్ కులస్తులేనని అన్నారు. డాక్టర్ సుధాకర్, కిరణ్‌కుమార్, దొమ్మేరులో బొంత మహేంద్ర, సామర్లకోటలో గిరిబాబు, ఎర్రగొండలో మోజేష్, కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను పొట్టన పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. హత్యచేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ వస్తుంది కాని దళితుడైన కోడికత్తి శ్రీనివాస్‌కు బెయిల్ రాదు అని అన్నారు. కోడికత్తి శ్రీను బెయిల్ విషయంలో రాష్ట్ర గవర్నర్ స్పందించాలన్నారు. తెలంగాణంలో కేసీఆర్ ఎటువంటి అహంకారంతో ఉన్నాడో అదే రీతిలో జగన్ ఉన్నాడని, అక్కడ కేసీఆర్‌కు పట్టిన గతే ఇక్కడ జగన్‌కు పడుతుందని హర్షకుమార్ అన్నారు. సమావేశంలో హర్షకుమార్ తనయుడు జీవి శ్రీరాజ్, ఎర్రా రామకృష్ణ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెర్లపాలెం సరిహద్దులో ఇసుక తవ్వకాలు

సర్పంచ్ ఫిర్యాదుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణ



మెర్లపాలెం సరిహద్దులో తవ్వకాలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన కంపెనీ సరిహద్దులు దాటి ఇసుకను అక్రమంగా తరలించి సుమారు రూ.20 కోట్లు ప్రజాధానాన్ని అక్రమార్కులు లూటీచేశారని మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో శనివారం సాయంత్రం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. రావులపాలెం మండలం ఊబలంక పరిధిలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందింది. ఈ సంస్థ సరిహద్దులు దాటి మెర్లపాలెం సమీపంలో అనధికారకంగా బాటలు వేసి ఇసుక తవ్వకాలు నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.20 కోట్ల మేర ఇసుక తరలించుకుపోయారు. ఈ మేరకు జనవరి 18న సర్పంచ్ రాము సెబ్, మైనింగ్ అధికారులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇసుక కమిటీ ఛైర్మన్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే సమీప ప్రాంతంలోని లంకలను కొల్లగొట్టి నిత్యం వందల లారీలతో బొండుమట్టిని తరలించుకుని కోట్లాది రూపాయలు అక్రమార్కులు దోపిడీకి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు కొత్తపేట సీఐ(సెబ్) డి.సురేఖ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని సర్పంచ్, వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుక, బొండు మట్టి తవ్వకాలను నియంత్రించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

రామాలయ నిర్మాణం ప్రభుత్వ విజయమనడం సరికాదు

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): 'గుడి కట్టినా, మసీద్ కట్టినా, చర్చి కట్టినా అది మతానికి సంబంధించినది. దానికి ప్రభుత్వం సహాయం చేస్తే చేయవచ్చు. కానీ రామాలయం కట్టడం ప్రభుత్వ విజయమని కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము ప్రకటించడం సరికాదు' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ అన్నారు. రాజ మహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ముస్లిం దేశాలన్నీ సెక్యులర్ దేశాలుగా మారుతున్నాయన్నారు. దుబాయి వంటి దేశాల్లో గుళ్లు కడుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశంలో సగానికి పైగా అంటే సుమారు 81 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నారని మరి దేశంలో పేదరికం పోయినట్లు ఎలా అనుకుంటామన్నారు. ప్రపంచ స్థాయి సర్వే సంస్థ ఒకటి ఇటీవల మిస్ ఇన్‌ఫర్మేషన్ అండ్ డిస్ ఇన్ఫర్మేషన్(పుకారులు, అబద్ధాలు) ఇవ్వడంలో భారతదేశం నెంబర్ 1గా ఉందని తేల్చారని ఆయన వివరించారు. ఇవాళ అందరిదీ జై శ్రీరామ్ అనే నినాదమైపోయిందని వాస్తవానికి హిందూమతమే సెక్యులర్ మతమన్నారు. ఇక బీజేపీ యాంటీ ముస్లిం వాతావరణాన్ని తీసుకొస్తోందని ఆయన



మాట్లాడుతున్న ఉండవల్లి అరుణకుమార్

అన్నారు. దేశంలో మోదీకి 38 శాతం మద్దతు ఉంటే వ్యతిరేకించే వారు 50 శాతం ఉన్నారన్నారు. వాళ్లంతా కలవాలని ఉండవల్లి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశంలో జనాభా పెరిగిపోయిందని, దక్షిణ భారతంలో కుటుంబ నియంత్రణ వల్ల జనాభా కంట్రోలులో ఉందని అన్నారు. లోక్‌సభ స్థానాలు పునర్విభజన జరిగితే 800 వరకూ ఎంపీ స్థానాలు ఉంటాయని ఉత్తర భారతంలో ఎక్కువ ఎంపీ స్థానాలు పెరుగుతాయన్నారు. పన్నుల ఆదాయం మనకంటే ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ వెళుతుందన్నారు. అందుకే తమిళనాడు మంత్రి ఒకరు దక్షిణ భారతదేశం ప్రత్యేక దేశంగా విడిపోయే పరిస్థితులు వస్తున్నాయని అంటే, ఆయన మీద కేంద్రం విరుచుకు పడిందన్నారు. అర్బన్ ఏరియాలో బహిరంగంగా జగన్‌ను వ్యతిరేకిస్తున్నారని, జగన్ ఎన్ని తప్పులు చేయగలడో అన్ని తప్పులు చేశాడని ఉండవల్లి అన్నారు. చంద్రబాబు, పవన్ కలవడం వల్ల వైసీపీ వణికిపోవాలని, కానీ 40శాతం మందికి ఉచిత పథకాలు ఇచ్చానని, తానే నెగ్గేస్తానని జగన్ భావిస్తున్నాడన్నారు. అయితే చంద్రబాబు అతని కంటే ఎక్కువ పథకాలు ప్రకటించారని దీనిపై చర్చ జరగాలని అన్నారు. కాంగ్రెస్ బలపడాల్సిన అవసరం ఉందని షర్మిల వల్ల బలం పెరగవచ్చునన్నారు. కాంగ్రెస్ పెరిగితేనే కేంద్రంలో బీజేపీని ప్రశ్నించే వీలుంటుందన్నారు.

6న చలో అసెంబ్లీని జయప్రదం చేయాలి

ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

అంబాజీపేట, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 6వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజా ప్రతినిధులంతా జయప్రదం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, కార్యదర్శి రంబాల రమేష్ కోరారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లకు పరిష్కారం చూపాలని 6వ తేదీన అసెంబ్లీని ముట్టడించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సంఘ నిధులు వైసీపీ ప్రభుత్వం కాజేసిందని వెంటనే తిరిగి సర్పంచ్‌ల ఖాతాలకు జమచేయాలన్నారు. అలాగే సర్పంచ్, ఎంపీటీసీలకు రూ. 15 వేలు గౌరవ వేతనం, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు వంతున గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం, ఫిబ్రవరి 3: జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున కడియం మండలం మురమండ గ్రామశివారు ముత్యాలమ్మ ఆలయం దాటిన తర్వాత మట్టిరోడ్డు నందు కొంత మంది పేకాడుతున్నారని తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ శనివారం కడియం పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. మురమండ ప్రాంతంలో పేకాడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రదేశానికి వెళ్లగా అక్కడ పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నామన్నారు. ఐదుగురు పరారయ్యారు. పట్టుకున్నవారు ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తుల నుంచి రూ. 5,880 నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 మోటారుసైకిళ్లు, స్విఫ్ట్ డిజైర్ కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3: కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం ఎదురుగా గల పిండాల చెరువులో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానిక టూటౌన్ పోలీసులు గుర్తించారు. శరీరంపై ఆకుపచ్చ రంగు చీర, ఎరుపు రంగు జాకెట్ ఉన్నాయని, ముఖాన్ని చేపలు కొరకడం వల్ల కొద్దిగా పాడైపోయిందన్నారు. మృతదేహాన్ని పరిశీలిస్తే చనిపోయి 48 గంటలు అయి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం టూటౌన్ పోలీసులను 9440796541, 9701626505 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 3: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఆవుల పుల్లారావు, కనకేశ్వరరావు అన్నదమ్ములు. గ్రామస్థులతో కలిసి శనివారం మోటారుసైకిళ్లపై కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఏడువారాల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా బొబ్బర్లంక దాటిన తర్వాత కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామ సమీపంలో యాక్టివా.. మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ బైక్ పైనుంచి కింద పడిపోయారు. కనకేశ్వరరావు(27) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. కాగా కనకేశ్వరరావుకు భార్య, 3 నెలల కుమార్తె ఉన్నారు.

మూగజీవాలపై వింత జంతువు దాడి

పెద్దాపురం, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో మూగజీవాలపై వింత జంతువు దాడి చేస్తోందని గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. స్థానిక పీహెచ్‌సీ సమీపంలో నివసిస్తున్న షేక్ బాషా మేకను వింత జంతువు తినేసిందని స్థానికులు గుర్తించారు. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇది అసలు వింత జంతువు పనా లేక ఎవరైనా కావాలని చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గత వారం రోజుల కిందట గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేగడంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు.

భార్యకు శిరోముండనం కేసులో వ్యక్తికి రిమాండ్

సీతానగరం,ఫిబ్రవరి 3: భార్యకు శిరోముండనం చేసిన నేరంపై నిందితుడు కర్రి రాంబాబు అలియాస్ అభిరామ్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ కోరుకొండ ఎ.నాగమురళి తెలిపారు. విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలు కారణంగా అభిరామ్ భార్యను చంపాలనుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యను కత్తి సహాయంతో బెదిరించి ట్రిమ్మర్ సహాయంతో గుండు గీసి చంపడానికి ప్రయత్నించగా చుట్టుపక్కల వారి సమాచారంతో బాధితురాలు ఆశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారని నిందితుడిని శనివారం అరెస్టుచేసి రాజమహేంద్రవరం 7వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో సెలక్షన్ జాబితాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3: రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ / సీహెచ్‌వో పోస్టుల ఫైనల్ సెలక్షన్ జాబితాలు జోన్ పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్లలో ఉంచినట్టు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మాశశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి జనవరి 12న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈనెల 5వ తేదీన ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

గండేపల్లి, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామంలో శుక్రవారం రాత్రి ఒకే రోజు సాగునీటి బోర్లు వద్ద ఉన్న 5 ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరును దొంగలించి ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్‌లు పడేసి వెళ్లిపోయారు. గండేపల్లి నుంచి సీతారాంపురం వెళ్లే రోడ్డులో ఉన్న పొలాల వద్ద సాగునీటి బోరులు వద్ద ఈ చోరీలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి నిఘా పెట్టి తక్షణం నిందితులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌బీ పట్నంలోనూ అపహరణ

పెద్దాపురం, ఫిబ్రవరి 3: మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గడిచిన 3 నెలల వ్యవధిలో గ్రామానికి చెందిన కంటిపూడి రామ్మూర్తి అనే రైతు పొలంలో 2 సార్లు చోరీ జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న రాగి తీగలను దొంగలు చోరీ చేస్తున్నారని, ఈ విషయంపై పోలీసులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో

భక్తుల రద్దీ

పెద్దాపురం, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం లోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 1,88,570 అన్నదాన విరాళాలు రూ.62,285 ఆదాయం, కేశఖండన ద్వారా 2800 వెరసి రూ.3,02,286 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో ఫణి నారాయణమూర్తి తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.



దంత వైద్య విధానంలో ప్రోస్టాడాంటిక్ మైలురాయి

ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్

రాజానగరం, ఫిబ్రవరి 3 : ప్రస్తుత కాలంలో దంతవైద్య విధానంలో ప్రోస్టాడాంటిక్ (కృత్రిమ దంత వైద్య) విధానం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్ అన్నారు. ఇండియన్ ప్రోస్టాడాంటిక్ సొసైటీ ఏపీ శాఖ ఆధ్వర్యంలో రాజానగరం లోని కెఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న 10వ రాష్ట్ర సదస్సు శనివారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రోస్టాడాంటిక్ సొసైటీలో 10వ రాష్ట్ర సదస్సు ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దంత వైద్యులు రెండు రోజులు పాటు జరిగిన ఈ సదస్సును దంత వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సు ఛైర్మన్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ తమ కళాశాలలో గత రెండు రోజులుగా జరిగిన ఈ సదస్సులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 215 వైద్య నిపుణులు, పీజీ విద్యార్థులు హాజరై వివిధ ప్రజెంటేషన్లు అందించగా వాటిలో 14 ప్రజెంటేషన్లు ఎంపికైనట్లుగా చెప్పారు. వీటిలో ఉత్తమ సైంటిఫిక్ పేపర్లు ప్రజెంట్ చేసిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ శేషారెడ్డి, లెనోరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాష్‌శెట్టి, కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టీఎస్‌వీ సత్యనారాయణ, సైంటిఫిక్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ కొండక, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

● ఇంటర్ పరీక్ష వాయిదాపై ఆగ్రహం
● తక్కువ పోస్టులతో నిరుద్యోగులకు మోసం
● మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: ర్యాలి జగన్మోహిని కేశవ, గోపాలస్వామి దేవస్థానం, ఉమాకమండలేశ్వరస్వామి దేవస్థానం శ్రీవాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, శ్రీసమయమంతుల, మాతంశెట్టి వార్ల అన్నదాన సత్రానికి ధర్మకర్తల మండలి నియామకం కోసం దేవదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు కార్యనిర్వహణాధికారి బి.కృష్ణచైతన్య తెలిపారు. రెండేళ్ల కాలపరిమితికి సంబంధించి నోటిఫికేషన్ జారీచేశారు. వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఓఎన్జీసీ పరిహారం విడుదల చేయాలని సీఎం లేఖ


సీఎం నుంచి లెటర్‌ను తీసుకుంటున్న మల్లాడి కృష్ణారావు

యానాం, ఫిబ్రవరి 3: యానాంలో మత్స్యకారులకు ఓఎన్జీసీ చమురు సంస్థ చెల్లించాల్సిన పరిహారం తక్షణమే విడుదల చేయా లని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్‌కు పుదుచ్చేరి ప్రభుత్వం కోరింది. శనివారం సీఎం ఎన్.రంగసామి, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మత్స్య శాఖ కార్యదర్శి నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. పరిహారం ఇవ్వాలని ఓఎన్జీసీ ఈడీకి లేఖ రాయాలని నిర్ణయించారు. ఈమేరకు మత్స్యశాఖ డైరెక్టర్ మహ్మద్ ఇస్మాయిల్ లేఖ విడుదల చేశారు. ఈలేఖను సీఎం రంగసామి ఢిల్లీ ప్రతినిధి మల్లాడికి అందజేశారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ యానాంలో ఓఎన్జీసీ సంస్థ వద్ద మత్స్యకారులు చేసిన ధర్నా విషయాన్ని ఓఎన్జీసీ ఈడీ, సీఎం ఎన్.రంగసామికి వివరించానన్నారు. ఈనేపథ్యంలో సీఎం రంగసామి తన చాంబర్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఓఎన్జీసీకి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఇచ్చిన నివేదిక ప్రకారం 5,462మందికి పరిహారం పుదుచ్చేరి ప్రభుత్వ శాఖతో జమచేయాలని కోరారన్నారు. ఆ లేఖను ఆదివారం కాకినాడలోని ఓఎన్జీసీ ఈడీ రత్నేష్‌కుమార్‌కు అందజేస్తానని మల్లాడి అన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు


శనేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మామిడికుదురు, ఫిబ్రవరి 3: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు వేకువజాము నుంచి వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. స్వామివారిని 2,965మంది దర్శించుకుని 2,104మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,68,358 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లుచేశారు.

శనేశ్వరాలయంలో భక్తుల పూజలు

కొత్తపేట, ఫిబ్రవరి 3: మందపల్లి మందేశ్వర(శనేశ్వర) ఆలయంలో శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి సర్వ దర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,06,103 ఒక్కరోజు ఆదాయం లభించగా, అన్నప్రసాద విరాళాల కింద రూ.36,958 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

టీడీపీలో చేరిన మేఘం

మండపేట, ఫిబ్రవరి 3: కేశవరానికి చెందిన వైసీపీ నేత, విష్ణాలయం దేవస్థానం చైర్మన్ మేఘం విష్ణు శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుసమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనను వేగుళ్ల కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నేతలు కర్రి తాతారావు కంటిపూడి శ్రీను, ఉండమట్ల సత్యనారాయణమూర్తి, సురేష్, గుడ్ల ఈశ్వరరావు, సుబ్బన్న, గారపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

అంబాజీపేట, ఫిబ్రవరి 3: స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మహిళా వైద్యులకు సన్మానం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న మహిళా వైద్యులను శనివారం సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు శ్రీపాద శ్రీనివాసపద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మల్లిక, డాక్టర్ నీతూలను సత్కరించారు. జోన్ చైర్‌పర్సన్ పచ్చిగోళ్ల సత్యకుమారితో పాటు మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, శ్రీగిరి పద్మావతి,యర్రమల్లి రామతులసి, కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, కోశాధికారి కె.విజయలక్ష్మి, బులిటెన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.

రవ్వ ప్లాంట్ వద్ద కొనసాగిన ఆందోళన

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 3: గ్రామాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన డిమాండ్లతో ఎస్.యానాం గ్రామస్తులు శనివారం రవ్వ ప్లాంటు మార్గంలో ఆందోళన కొనసాగించారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేదిలేదని ఆందోళనకారులు స్పష్టం చేశారు. రవ్వ వద్ద ఆందోళన చట్ట విరుద్ధమని, ఆందోళనకు ఎటువంటి అనుమతి తీసుకోనందున ఆందోళనకారులపై కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.మనోహర్‌జోషీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ ఫోరం ఉపాధ్యక్షుడిగా స్వామిప్రసాద్

మండపేట, ఫిబ్రవరి 3: ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఉపాధ్యక్షుడిగా ద్వారపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తున్న జి.స్వామిప్రసాద్ నియమితులయ్యారు. రామ చంద్రపురంలో జరిగిన డివిజన్ స్థాయి సైన్సు ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఎంపిక జరిగిందని ప్రసాద్ తెలిపారు.

సిద్ధివినాయకుని దర్శించుకున్న ఆర్డీవో

అయినవిల్లి, ఫిబ్రవరి 3: కొత్తపేట ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ శనివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ సభ కోసం విద్యార్థుల జీవితాలతో ఆటలా?



మండపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేట: భవిష్యత్తు గ్యారంటీ పత్రాలు అందించిన బండారు సత్యానందరావు

మండపేట, ఫిబ్రవరి 3: అధికార పార్టీ సభ కోసం శనివారం జరగాల్సిన ఇంటర్ తొలి సంవత్సరం ఎన్విరాన్‌మెంట్ పరీక్షను వాయిదా వేసి, ప్రైవేటు పాఠశాల బస్సులను జనం తరలింపు కోసం తీసుకుని, పాఠశాలలకు సెలవు ప్రకటించి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఇంటర్ పరీక్ష ఈనెల23న వాయిదా వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగాఉంటే కేవలం ప్రభు త్వం 6100 పోస్టులకే నోటిఫికేషన్ విడుదలచేసి డీఎస్సీ అభ్యర్థులను మరోసారి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. జనవరి 1న ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న సీఎం జగన్ ఇచ్చిన హామీ ఏమైందని వేగుళ్ల ప్రశ్నించారు. తెలంగాణలో గంజాయి తరలిస్తూ ఏపీ పోలీసులు పట్టుబడిన నేపథ్యంలో ఏపీ పరువు మంట కలిసిపోతుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మండపల్లి చంద్రశేఖర్, ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు, వాకచర్ల గుప్తా పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కొత్తపేట, ఫిబ్రవరి 3: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. శనివారం కొత్తపేట శివారు చిన్నగూళ్లపలెం, పెదగూళ్లపాలెంలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజాధనాన్ని సలహాదారుల పేర దుర్వినియోగం చేస్తున్నారని, అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం ష్యూరిటీ పత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక చేసే సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, వాసంశెట్టి సత్యనారాయణ, యల్లమిల్లి జగన్మోహన్, బూసి విష్ణుమూర్తి, కముజు వెంకటేశ్వరరావు, విళ్ల వీరమారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయాంధ్ర ప్రదేశ్‌గా మార్చారు

మామిడికుదురు, ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పాలనలో రాష్ట్రానికి కంపెనీలు తీసుకువస్తే జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి గంజాయి తెచ్చారన్నారు. ప్రభుత్వ పాలనలో అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా స్మగ్లింగ్ అవుతుందని, గంజాయి మత్తులో పడి యువత భవిష్యత్తు నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అధికార పార్టీ నాయకులు చేసిన గంజాయి స్మగ్లింగ్, ఇప్పుడు పోలీసులు కూడా ఈవ్యాపారంలోకి ప్రవేశించారని ఆరోపించారు. దీనికి నిదర్శనమే హైదరాబాద్‌లో కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌కు చెందిన పోలీసులు గంజాయితో చిక్కడమే అని అన్నారు. ప్రతీ సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పి యువతను మభ్యపెట్టి జాబ్ క్యాలెండర్ మర్చిపోయి, ఎన్నికల ముందు హడావిడిగా డీఎస్సీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా యువత మేల్కొని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని నామన కోరారు.

రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

పి.గన్నవరం, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో భవిష్యత్తులో రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. కుందాలపల్లి గ్రామంలో జనసేన నాయకులతో కలిసి నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై విసిగిపోయారని, అభివృద్ధి చేసే టీడీపీ, జనసేన ప్రభుత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారంటీ పత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పప్పుల సాయిబాబు, తోలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, కొమ్ముల శ్రీను, నేలపూడి దామోదరం, పప్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు సముచిత స్థానం

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు


రాయవరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాయవరం, ఫిబ్రవరి 3: బీసీలకు సముచితస్థానం కల్పించింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని, బీసీలకు సముచిత స్థానం దక్కాలంటే టీడీపీ-జనసేన కూటమిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం రాయవరంలో నిర్వహించిన జయహో బీసీ సమావేశంలో ఆయనమాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ పాటుపడితే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక బీసీలకు మరింత సముచితస్థానం కల్పించారన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేసిందన్నారు. టీడీపీ-జనసేన కూటమిని గెలిపించి పూర్వ వైభవం తెచ్చేకునేందుకు బీసీలంతా ప్రతినబూనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పిల్లి వెంకట్రావు, కొప్పిశెట్టి మాధవరావు, అనుసూరి శ్రీను, నూలు వీరవెంకట సత్యనారాయణ, బర్ల రాజు, చల్లా సత్యనారాయణ, పిల్లి గణేష్, వాసంశెట్టి బాబి, వెలుగుబంట్ల గోపీ కృష్ణ, ఎంపీటీసీ వుండవిల్లి సుబ్బారాయుడు, వాదా ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు వైఆర్కే పరమహంస, పాలింగి చిన్నబాబు, సుంకవల్లి గంగరాజు, పుచ్చల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేసిన సీఎం జగన్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో నిరుద్యోగులను నిండా ముంచి దగా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. కేంద్ర గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 50,900 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతుంటే కేవలం 6100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అధికారంలోకి రాగానే ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని, మెగా డీఎస్సీ వేస్తానని చెప్పి నిరుద్యోగులను దగా చేసారని ఆరోపించారు. టీడీపీ హయాంలో నిరుద్యోగులకు భృతి చెల్లించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. అమలాపురంలో శనివారం జరిగిన సమావేశంలో ఆనందరావు మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మారిస్తే జగన్‌రెడ్డి గంజాయికి హబ్‌గా మార్చారని విమర్శించారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా అందుకు మూలాలు ఏపీలోనే ఉండడం జగన్ అరాచక పాలనకు నిదర్శనమన్నానరు. పోలీసులే గంజాయి స్మగ్లర్లుగా మారుతున్నారంటే అంతకంటే దౌర్భాగ్యం ఏముంటుందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చే టీడీపీ, జనసేన ప్రభుత్వం మెగా డీఎస్సీని వేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడం జరుగుతుందన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, భాస్కర్ల రామకృష్ణ, కర్రి రామస్వామి, నల్లా స్వామి, బొర్రా వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, పెద్దిరెడ్డి పుల్లయ్యనాయుడు, కుంచే వెంకన్నబాబు, దాసం గోపి, వలవల శివరావు, బత్తుల ప్రసాద్, నల్లా మల్లిబాబు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో గంజాయి సామ్రాజ్యం

రామచంద్రపురం, ఫిబ్రవరి 3: టీడీపీ పాలనలో పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు ఇస్తే జగన్‌రెడ్డి పాలనలో గంజాయి సామ్రాజ్యం విస్తరించి రాజ్యమేలుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఎద్దేవా చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ అని సీఎం జగన్ యువతను దగా చేశారన్నారు. గంజాయి మాఫియాకి ఏపీ సర్కార్ పెద్దల అండదండలు ఉండడంతో పోలీసులు కూడా పాలు పంచుకుంటున్నారని విమర్శించారు. కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ 22కిలోల గంజాయితో హైదరాబాద్ పోలీసులకు చిక్కడం మన రాష్ట్ర దుస్థితిని తెలుపుతుందన్నారు.సిద్ధం సభకు జనాన్ని తరలించడానికి స్కూళ్లు, కాలేజీల బస్సులను తీసుకుని, ఇంటర్ పరీక్షలు వాయిదా వేయడం అంటే విద్యా వ్యవస్థను అవమానించడమేనన్నారు.

6న కొత్తపేట నవనిధిలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఈనెల6న కొత్తపేట నవనిధి ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్న జిల్లా ఉపాధి అధికారిణి యి.వసంత లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లు, బయోడేటాతో ఉదయం 10.30గంటలకు హాజరుకావాలని కోరారు. అమరావతి టీవీఎస్‌లో పనిచేసేందుకు ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులన్నారు. అమలాపురం, యానాం, సామర్లకోటలో పనిచేసే అవకాశం కల్పిస్తారని, జీతం రూ.8వేల నుంచి రూ.15వేల వరకు ఉంటుందన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సులో 53పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. రూ.15వేల నుంచి రూ.22వేలు వేతనం అందిస్తారు. పేటీఎం ఫీల్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు వంద ఉన్నాయని, 10నుంచి డిగ్రీ చదివినవారు అర్హులని, రూ.13,500 నుంచి రూ.20వేలు వరకు వేతనం ఇస్తారని తెలిపారు. వివరాలకు సెల్ 8121838392ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జేసీ ఎస్.నుపూర్‌అజయ్ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి క్రీడా పోటీలు అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. ఈపోటీలను శనివారం ఆమె పరిశీలించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో ప్రతిభ కలిగిన వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. పలు పోటీల విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను జేసీ అందజేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు మెట్టి గౌరీశంకరరాజు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఐ.భీమేష్, పాయసం శ్రీనివాసరావు, మహబూబ్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

రామచంద్రపురం, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల శంకరనారాయణ ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనేపల్లి అయ్యాజీవేమా, పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, కర్రి చిట్టి బాబు, పట్టణ, రూరల్ అధ్యక్షులు కేశవ రాఘవేంద్ర, ఆకేటి శ్రీకృష్ణ, కె.గంగవరం మండల అధ్యక్షుడు అవసరాల వెంకటరమణమూర్తి, కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్ నాయుడు, వి.ధనరాజు, కె.లక్ష్మి, టి.అమ్మాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: బీజేపీ సహవ్యవస్థాపకుడు, ఆర్ఎస్ఎస్ నేత ఎల్కే అద్వానీకి కేంద్రం భారతరత్న ప్రకటించడంపై బీజేపీ శ్రేణులు హర్షం ప్రకటించాయి. అద్వానీ విజయాలను జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ వివరించారు.

మండపేట: బీజేపీ సీనియన్ నేత, మాజీ ఉపప్రధాని లాల్‌కృష్ణ అద్వానికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై బీజేపీ మండపేట నియోజకవర్గ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అద్వాని బీజేపీకి, దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ నాయకుడు కె.సత్యనారాయణ, సాయిరాం పేర్కొన్నారు.

ముగిసిన కేపీఎల్ క్రికెట్ ప్రీమియం లీగ్ పోటీలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 3: కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ ప్రీమియం లీగ్‌పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రీమియర్ లీగ్ విన్నర్‌గా జగ్గన్నపేట జట్టు నిలవగా రూ.50వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీని టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులు అందజేశారు. రావులపాలెం జట్టు రన్నర్‌గా నిలిచి రూ.25వేలు బహుమతితోపాటు ట్రోఫీని జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, టీడీపీ జిల్లాప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడులు అందజేసారు. కొంకాపల్లి యూత్, జీపీఆర్ టీముల ఆధ్వర్యంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, ఆశెట్టి ఆదిబాబు, చిక్కాల రాంబాబు, నల్లా చిట్టిబాబు, బొర్రా వెంకటేశ్వరరావుతో పాటు నిర్వాహకులు ఇండుగుల ఆనంద్, గుమ్మళ్ల శ్రీను, సత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పౌరహక్కుల సంఘం జిల్లా మహాసభ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: పౌర హక్కుల సంఘం 50 వసంతాల ఉద్యమ ప్రస్థానంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 17వ మహాసభ ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్టు అమలదాసు బాబూరావు తెలిపారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పౌరహక్కుల ఉద్యమ ప్రస్థానం గురించి, రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు భారత రాజ్యాంగం-అమలుతీరు-మణిపూర్ మారణహోమం అనే అంశాలపై ప్రసంగిస్తారన్నారు.

విద్యా బోధనలో సాంకేతికత అంతర్భాగం కావాలి

రామచంద్రపురం, ఫిబ్రవరి 3: విద్యా బోధనలో సాంకేతికత అంతర్భాగం కావాలని ఉపాధ్యాయుల శిక్షణా కోర్సు డైరెక్టర్ వీరరాఘవరెడ్డి అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాలలో శనివారం ఎంఈవో నాగేశ్వరి, జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధించే భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులను వీరరాఘవరెడ్డి నిర్వ హించారు. కార్యక్రమంలో ఐఆర్టీ కోఆర్డినేటర్ నారాయణ, రిసోర్స్‌పర్సన్ పి.వీరబ్రహ్మానందం, కోడి ప్రసాద్ రామకృష్ణ, ఇనుమర్తి ప్రసాద్, జి.శ్రీనివాస్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: బూట్‌కట్ బాలరాజు
శ్రీలలిత	: ధీర
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్

బీవీలంకలో జనసేనలో చేరికలు



ఆలమూరు, ఫిబ్రవరి 3: బడుగువానిలంకలో పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. పడాల అమ్మిరాజు సమక్షంలో గ్రామానికి చెందిన దూలం లక్ష్మణరావు, పలువురు నాయకులకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ సూరపురెడ్డి సత్య, నాయకులు సంగిత సుబాష్, మండపల్లి సోమశేఖర్, దూలం విశ్వేశ్వరరావు, పడాల సూరిబాబు, కప్పల సురేష్ పాల్గొన్నారు.

చింతలమోరిలో జనసేన జెండా స్తూపం ఆవిష్కరణ

మలికిపురం, ఫిబ్రవరి 3: చింతలమోరి పోడితోట సెంటర్‌లో చింతలమోరి జనసేన పార్టీ నేత డాక్టర్ రాపాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నూతన జెండా స్తూపం ఆవిష్కరణ జరిగింది. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, జనసేన, టీడీపీ విజయంలో ప్రతీ ఒక్కరూ పాలు పంచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. బొంతు రాజేశ్వరరావు, జనసేన, టీడీపీ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణిరాము, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, తాడి మోహన్‌కుమార్, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ దోహదం చేస్తుంది

రాజోలు, ఫిబ్రవరి 3: విద్యా విధానంలో ముఖ్యంగా సైన్స్, గణితంలో టెక్నాలజీ ఆధునీకత చోటు చేసుకునే సందర్భంలో ఉపాధ్యాయులకు ఐసీడీ సిమ్యులేషన్ శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని ఎంఈవో ఎస్.మనోహరం తెలిపారు. రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు బోధించే గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు ఐసీడీ సిమ్యులేషన్ శిక్షణను మూడు రోజులు ఇస్తున్నామన్నారు. ఈశిక్షణకు పరిశీలకుడిగా కమ్యునిటీ మొబిలైజేషన్ అధికారి బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. శనివారం జరిగిన శిక్షణలో వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అలా అమలు చేసేవారికి మాత్రమే వచ్చే ఎన్నికల్లో మా కుటుంబాల మద్దతు ఉంటుందనే కార్యాచరణలో భాగంగా శనివారం రాత్రి అమలాపురం ఎంప్లాయీస్ హోంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీఎస్ సుబ్బారావులు మాట్లాడుతూ సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఓపీఎస్ అమలుకు స్పష్టమైన హామీ ఇచ్చే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఓపీఎస్ పునరుద్ధరణను మేనిఫెస్టోలో చేర్చి పార్టీ వైఖరిపై బహిరంగ ప్రకటన చేయాలని వెంకటేశ్వరరావు ప్రధాన పార్టీలకు పిలుపునిచ్చారు. బీఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో క్రీడా సమ్మేళనం

యానాం. ఫిబ్రవరి 3: నారాయణ విద్యాసంస్థల్లో అమలాపురం జోన్ పాఠశాల ప్రీమియమ్ లీగ్‌లో భాగంగా యానాంలో క్రీడా సమ్మేళనం నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో యానాం ప్రాంతీయ పరిపాలనాధిరి మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, అమలాపురం జోన్ విద్యాశాఖాధికారిని నాగమణిలు క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈపోటీల్లో మండపేట, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం, యానాం పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అమలాపురం జోన్ నారాయణ పాఠశాల ఏజీఎం శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ సుంకరమూర్తి పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బాబు కంటి చూపు కోసం దాతల విరాళాలు

అంతర్వేది, ఫిబ్రవరి 3: మానవతామూర్తులు గ్రూప్ ద్వారా అంతర్వేదికి చెందిన సాగిరెడ్డి విశాక్‌భాస్కరఇందీవర్ కంటి ఆపరేషన్ కోసం రూ.1.14లక్షలు దాతల సహకారంతో అందించారు. గ్రూపుసభ్యులు జంపన బుజ్జిరాజు, పల్లపోతు జైదీప్, నల్లా కిరణ్‌ప్రసాద్, డాక్టర్ యాండ్ర రాంబాబు, పోతురాజు వెంకటరత్నం(నానాజీ) శనివారం నగదును అందించారు. గ్రూప్ అడ్మిన్ బోనం రాజు పెట్టిన మెస్సేజ్‌తో ఎందరో దాతలు విరాళాలు అందించారు. సహాయం అందించిన వారికి విశాక్ తల్లి సాగిరెడ్డి పూర్ణ కృతజ్ఞతలు తెలిపారు. పిల్లా రాజబాబు, అడబాల శ్రీను, అడపా బుల్లబ్బులు, రావి నరసింహారావు, బోనం విజయసారథి, మానవమూర్తుల టీమ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కొత్తపేట, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు పేర్కొన్నారు. కొత్తపేటలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు అధ్యక్షతన శనివారం నియోజకవర్గ స్థాయి బీజేపీ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఈనెల9,10,11తేదీల్లో బీజేపీ తలపెట్టిన పల్లెకుపోదాం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాలూరి సత్యానందం, పొట్లూరి రామ్మోహనరావు, మానేపల్లి అయ్యాజీవేమా, అడబాల సత్యనారాయణ, తమలంపూడి రామకృష్ణారెడ్డి, రావూరి సుధ, యిళ్ల సత్యనారాయణ, పాలూరి జయప్రకాష్‌నారాయణ, మోకా సుబ్బారావు, పాలాటి మాధవ్‌స్వామి పాల్గొన్నారు.

ప్రాజెక్టు నమూనాల ప్రదర్శన

కాట్రేనికోన, ఫిబ్రవరి 3: చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో విద్యార్థుల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన వివిధ ప్రాజెక్టు నమూనాల ప్రదర్శనను ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈప్రదర్శనలో మొదటి మూడు ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, పాలకవర్గ సభ్యుడు సందీప్, విద్యాశాఖాధికారి ఎస్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

అల్లవరం, ఫిబ్రవరి 3: ఓడలరేవు సముద్ర తీరంలోని సరుగుడు తోటలో అమలాపురంరూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ శనివారం దాడిచేసి పేకాట ఆడుతున్న 11మందిని అరెస్టుచేశారు. రూ.42,120 స్వాధీనం చేసుకున్నామని, వీరిని కోర్టులో హాజరుపరుస్తామని వారు తెలిపారు.

మహాసంకల్ప యాత్ర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: జనసేన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో 91వరోజు శనివారం మహాసంకల్ప యాత్ర నిర్వహించారు. అమలాపురం పట్టణంలో ఇంటింటికీ తిరిగి జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు సూదా చిన్నా, గండి మణికంఠస్వామి, చిక్కాల సతీష్, పిండి రాజా, మహాదశ నాగేశ్వరరావు, కంచిపల్లి దేవి, దూలం వరలక్ష్మి, దంగేటి జేబి, గోళ్ల కమల, రొక్కాల నాగేశ్వరరావు, మామిళ్లపల్లి దొరబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను హత్య చేయడం దారుణం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 3: విశాఖపట్నం తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడం దారుణమని ఏపీ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్ పేర్కొన్నారు. రమణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీఆర్వోల సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హత్యకు పాల్పడిన దోషులు ఎంతటివారైనా శిక్షించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ మల్లేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

అల్లవరం, ఫిబ్రవరి 3: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం బదిలీ అయిన తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌ను అల్లవరంలో శనివారం దుశ్శాలువాలతో సత్కరించారు. డిప్యూటీ తహసీల్దారు ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, వీఆర్వో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మకు వీడ్కోలు

కె.గంగవరం, ఫిబ్రవరి 3: కె.గంగవరం తహసీల్దార్ టి.వైద్యనాథ్‌శర్మ ఎన్నికల బదిలీల్లో భాగంగా అమలాపురం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు మండల వీఆర్వోలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పట్టాభి, వెంకటేశ్వరరావు, వెర్రియ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రమాకుమారికి వీడ్కోలు

అంతర్వేది, ఫిబ్రవరి 3: సఖినేటిపల్లి తహసీల్దార్ వై.రమాకుమారి కొత్తపేట ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీ అయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఎలీషా

కొత్తపేట, ఫిబ్రవరి 3: కొత్తపేట తహసీల్దార్‌గా జి.ఎలీషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా వేలూరుపాడు తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన జీడీ కిశోర్‌బాబు ఎన్టీఆర్ జిల్లా వెస్ట్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

మండపేట మున్సిపల్ కమిషనర్‌గా రాము

మండపేట, ఫిబ్రవరి3: మండపేట మున్సిపల్ కమిషనర్‌గా బి.రాము శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడపనిచేసిన టి.రామ్‌కుమార్ ధర్మవరానికి బదిలీ అయ్యారు. విశాఖ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన రాము ఇక్కడకు వచ్చారు. ఆయనను కార్యాలయం సిబ్బంది మార్యాదపూర్వకంగా కలిసారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, ఫిబ్రవరి 3: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదానానికి నర్సాపురానికి చెందిన పీవై సంపత్‌కుమార్ ఆచార్యులు-కమల దంపతులు రూ.50వేలు విరాళాన్ని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందించారు.

కిట్స్‌లో రహదారి భద్రతా వారోత్సవాలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 3: అంబికపల్లి అగ్రహారం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఆర్‌టీవో అధికారి ఆర్.రాజేంద్రప్రసాద్ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా.వెంకట్ బర్ల, పవన్‌కుమార్, పరిపాలనాధికారి ఏఎస్‌వీ రవిధర్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

అల్లవరం, ఫిబ్రవరి 3: ఓడలరేవు గ్రామదేవత శ్రీముత్యాలమ్మ ఆలయం వద్ద శనివారం ఘనంగా జాతర జరిగింది. తీన్‌మార్ వాయిద్యాలు, గరగనృత్యాలతో అమ్మవారి జాతరను నిర్వహించారు. రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలించిన ఏడీఏ

అంబాజీపేట, ఫిబ్రవరి 3: వక్కలంక, ఇరుసుమండ గ్రామాల్లో ఈక్రాప్ నమోదును ఏడీఏ ఎస్‌జేవీ రామోహనరావు పరిశీలించారు. మార్పులు, చేర్పులుంటే రైతులు సరిచేసుకోవచ్చన్నారు. ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏ, వీహెచ్ఏ పాల్గొన్నారు.